**బ్రతకడానికేదో పనిచెయ్యక తప్పదు. ఆ పనితో బ్రతుకునే ముడి పెట్టుకున్న 'తీపి దాక్షయ్య'లు కొందరుంటారేమో?**

**ఏలూరునుంచి బయలుదేరి ముడత నలగకుండా మద్రాసయినా వెళ్ళి రావచ్చుగానీ, అరవై మయిళ్ళ దూరంలోవున్న తాడేపల్లిగూడెం వెళ్ళి రావాలంటే నిజంగా బ్రహ్మప్రళయమే అవుతుంది.**

ఎక్కడనుంచి వూడతారో ఆ జనం!

ఉండటానికి ప్రతీ పావుగంటకీ ఒక బస్సువుంది. అన్ని బస్సులూ అంతే-కిటకిట లాడిపోతుంటాయి.

# దాక్షయ్య (కథ)


### చియార్

ఒక గంటసేపు చూసిచూసీ నాలుగు బస్సులు వెళ్ళగొట్టుకుని. ఇంకెన్ని బస్సులు వచ్చినా ఇంతేగదా! అని అయిదో బస్సు రాగానే పరుగెత్తాను.

నాలుగు వయిపులనుంచీ నన్ను మించి పరుగెత్తుకు వస్తున్నారు జనాలు. అందరం మూగేశాం. నెట్టుకుంటున్నాం. తిట్టుకుంటున్నాం. కండక్టరు అరుస్తూనే వున్నాడు. వినిపించుకునేదెవరు?

ఎలాగోలాగా- నేనే నెట్టుకుని ఎక్కేశానో, వెనకవాళ్ళు నెట్టగా లోపల పడ్డానో -మొత్తానికి అందరికంటే ముందు ఎక్కేశాను.

టిక్కట్టు తీసుకుని కండక్టరుకి వెనకాల నాలుగో వరస జంట సీటులో కూర్చున్నాను. ఖాళీగా ఉన్న ఆ వరస సీటుల్లో అదే ఆఖరిది.



క్రింగ జనం కుమ్ములాడుకుంటున్నారు. చొక్కాలే చిరుగుతాయో; జేబులే తరుగుతాయో ఏమీ చూసుకోవటంలేదు. బస్సులో పడి పోవాలి. ఎవరి తొందర వారిది ఎవరి ఆత్రం వారిది.

ఇంతలోకే ఆ పద్మ వ్యూహంలోకి దాక్షయ్య ప్రవేశించాడొక కొసనుంచి.

ఇతని అసలు పేరు దాక్షయ్యేనో కాదో తెలీదు. అందరూ అలాగే పిలుస్తుంటారు. ఇతను పలుకుతూనూ ఉంటాడు.

చెప్పవలసి వచ్చే సరికి సందేహం కలిగిందే గానీ, ఇంతకు ముందెప్పుడూ ఇతని పేరుని గురించి ఆచూకీ తియ్యాలని అనిపించలేదు—!

మా జంక్షనులో ఎప్పుడూ, ఊళ్ళో అప్పుడప్పుడూ ద్రాక్షపళ్ళు అమ్ముకుంటూ ఉంటాడు. అందుకే అందరం 'దాక్షయ్యా' అంటూ ఉంటాం.

మా ఊళ్ళో ఇతను అడుగుపెట్టాడూ

అంటే ద్రాక్షపళ్ళ కాలం వచ్చినట్టే లెక్క. ఇతనితోపాటే అవీ - వాటితో పాటే ఇతనూ.

ఇతడు ద్రాక్షపళ్ళు అమ్మకునే తీరులో ఒక అందం వుంది. అరిచే అరుపుల్లో కవిత్వం వుంది. అమ్మె ద్రాక్షపళ్ళ సౌకుమార్యం అతని అరుపుల్లో అప్పుడప్పుడూ తళుక్కుమంటుంది.

గాంధీ దిమ్మమీద కాడమలె నీడలో కూర్చుంటాడు. బస్సు జంక్షనులోకి రావడంతోనే జంగిడీ పుచ్చుకుని వెంబడిస్తాడు. అది ఆగడమూ ఇతను చేరుకోవడమూ ఒకేసారి.

ఆ బస్సు మళ్ళీ బయలుదేరే లోపులో "దాక్షా! దాక్షా! తీపి దాక్షా!-" అని అరుచుకుంటూ ఎన్ని ప్రదక్షిణాలయినా చేసాడు.

మోకాలి మీద జంగిడీ ఆన్చి ఒంటి కాలి మీద వ్యాపారం చేసేస్తుంటాడు.

బేరాలు సాగుతున్నప్పుడు ఒకటే అరుపుగానీ సాగనప్పుడు ఇతని అరుపు అనేక రకలుగా మారుతూంటుంది.

"తింటే దాక్షే తినాలి!
కొంటే తమరే కొనాలి!"
అంటాడు ఒక్కొకరిని చూసి.

బస్సులో వున్నవాళ్ళ అంద చందాలని బట్టి "వొక్కపండు - వొక్కరూపాయి. వొంద గ్రాము లద్దు రూపాయి" అంటుంటాడు

"దాక్షా, దాక్షా, తీపి దాక్ష" అనే దాన్ని మాత్రం వదిలి పెట్టడు. అన్నింటికీ అదే పల్లవి. తిరుగుతున్నా అదే కేక. తూస్తున్నా అదే అరుపు.

పిల్లలున్న సీటు దగ్గర దీన్ని సాధ్యమయినంత శ్రావ్యంగా అంటూ పదే పదే తచ్చాడతాడు. పాడయిపోయిన పళ్ళని ఏరి పారేస్తూ అక్కడే నిలబడి బెలిపిస్తాడు. అప్పటికీ పని జరగకపోతే ఒకటో, రెండో విడిపళ్ళు తీసి పిలల కందించి పలకరిస్తాడు. నవ్విస్తాడు. ఇది వాళ్ళ పెద్దలకి కవ్వింపు. కనీసం ఒక వందగ్రామలైనా కొనక మానరు.

ఇంతగా శ్రమపడినా ఒక్కొక్క సారి ఒక్కొక్క బస్సు దగ్గర బేరమే వుండదు. అలాంటప్పుడు అది కదలగా చూసి "గొడ్డుమోతు 'బస్సు" అంటూ వెనకాల రేకు మీద ఢామ్మనిపించి కసి తీర్చుకుంటాడుట.

ఇతను మా వూళ్ళో వుండేది ఆ ద్రాక్షపళ్ళ కాలంలో మాత్రమే. అయితేనేమి మాలో ఒకడయిపోయాడు. పొరుగూరువాడని ఎవరికి అనిపించదు.


సర్కారు ఇంజినీరింగు కాలేజి
మచిలీపట్నం_521 001 (A. P)

కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వములచే బి. ఇ. (B.E.) డిగ్రీకు సమానముగా రికగ్నయిజ్ కాబడిన ఎ. ఎం. ఐ. ఇ. (A.M.I.E.) పరీక్షలకు ఎప్రంటిస్ షిప్ ప్రాక్టికల్ ట్రయినింగ్. థియరీతోసహా ప్రత్యేక (Full-Time) అధ్యాపకులచే సమగ్ర శిక్షణ ఇచ్చు ఫుల్ డే ప్రైవేట్ కాలేజి. కనీస అర్హత ఇంటర్ ఎం.పి సి. ప్రాస్పెక్టస్. అప్లికేషన్ ఫారములకు రూ. 5/- ఎం.ఓ. చేయవలెను. 50 సీట్లు అయిపోయినవి. ఇంకా 25 సీట్లు మాత్రమే.

ఎన్. టి. జ్ఞానప్రకాశం, ఎం. ఇ., ఎం. ఐ. ఇ.
ప్రిన్సిపాల్.

Vijaya




SPRINGFIELD AGENCIES (Regd.)
E-32 FATEH NAGAR NEW DELHI-110018


ఆర్డరు ఫారం
ఈరోజే పోస్టు చేయండి

The Manager A J P-2
Springfield Agencies (Regd.), New Delhi-110018

Dear Sir,
Please send me One Springfield Supershot-77 Air Rifle on Rs. 20/- per month instalment alongwith all the documents for possession. As per your instalment system, I agree to pay the instalments regularly.

NAME.............................. AGE........YEARS
ADDRESS..............................................
P O .................. PIN ☐☐☐☐☐☐ DIST..............
OCCUPATION.................. SIGN..................

FILL THIS FORM IN ENGLISH IN BLOCK LETTERS
DO NOT SEND ANY ADVANCE WITH THIS ORDER




చేసేది వ్యాపారమే అయినా మాయా మర్మం ఎరగని వాడు. అంతేకాదు చిన్నా, పెద్దా తేడా తెలిసినవాడు కూడా.

నా చూపులు దాశయ్యని వదలటంలేదు. గుడ్డ సంచీలో-ఏమిటో మరి- ముత్తేలమ్మ మూటలాగా కట్టాడు. దాన్ని ఎడమ అరచేతిలో జంగిడీలాగా పైకెత్తి పట్టుకుని అతి కష్టం మీద అందరినీ నెట్టుకుంటూ బస్సెక్కాశాడు. గమనిస్తూనే వున్నా. అరచేతిలో మూట పడలేదు సరిగదా కదలనయినా కదలలేదు.

టికట్టు తీసుకుని నేను కూర్చున్న సీటు దగ్గరికి వచ్చాడు, నన్ను చూడగానే పెదవుల మధ్యనుంచి ఆ టికట్టు ముక్క తీసేసి—

"సరుకోసం గూడెం వెళ్తున్నానండి" అన్నాడు వినయంగా.

"నేనూ గూడెమేలే - దా - కూచో-!" అంటూ సీటు మీద వేసిన కర్చీఫ్ తీసి భుజమ్మీద వేసుకున్నాను! కూర్చోటానికి కొంచెం జంకాడు. పరవాలేదులే కూర్చోమన్నాక కూర్చున్నాడు.

ఇంకా జనం చాలామంది వున్నారక్కింద. మరెవ్వరినీ ఎక్కనివ్వలేము కండక్టరు. కళాకళలు. యేం చిరాకు వచ్చిందో. యేమో డోరు తలుపీమని వేసేసి "రైట్" అన్నాడంతే బస్సు కదిలింది. వేగాన్ని పుంజుకుంది.

"నిన్న సందాలండి- గబగబా నాలుగు మంచిబేరాలు తగిల్నియ్యండి- యేదో తమ దియవల్ల!

అందుకనండీ! యియ్యాలే గూడెం ఎల్లాల్సొచ్చిందండి! లెకపోతేనండి! రేపెల్లటం రివాజండి!"

ఇంకా ఇలాగే ఏమిటేమిటో చెప్పుకుంటూ పోతున్నాడు అండీ అండీ అంటూ, ఏదో పిచ్చాపాటీని. అమాయకుడు. ఊరుకోమనలేక ఊఁకొడుతూ మధ్యమధ్యలో ఒక్కొక్క మాట అంటున్నాను. ఎంతగా అభిమానం వున్నా, ఆగరం వున్నా. అన్నివేళలా భరించలేం గదా!

ఇతనికి నిద్రవస్తోంది. చూశాను. బలవంతాన ఆపుకుంటున్నాడు మర్యాద కోసం.

"నిద్ర వస్తున్నట్టుంది- తూలుతున్నావ్. నిద్రపో- ఫరవాలేదు వెనక్కి జారడు!" అనేసి మరింక మాట్లాడనివ్వలేదు. మాట్లాడించనూ లేదు.

డ్రయివరూ, కండక్టరూ, నేనూ, ఇంకా ఇలాగే ఇద్దరో ముగ్గురో తప్ప మొత్తం బస్సులో అందరూ జోగుతూనే ఉన్నారు.

చలికాలం ఎండలో ఒక కరుకుదనమూ వుంది, ఒక మాంద్యమూ వుంది. అందులోనూ భోజనాలుచేసిబయలుదేరేవేళ బస్సులన్నీ జోగుతూనే వుంటాయి. బొప్పికట్టి దిగేవాళ్ళు ఎంతమంది!

దాశయ్య పూర్తిగా నా భుజంమీదకి ఒరిగిపోయాడు. అప్పటికే రెండుసార్లు తలఆన్చడమూ, నేను నెట్టడమూ జరిగింది. ఇక పోనీలే పాపం అని ఊరుకున్నాను. నిద్ర సుఖం ఎరగదన్నారు. అంతరువూ ఎరగదు.

ఉన్నట్టుండి బస్సు వేగం తగ్గిపోయింది. ఆగనూ ఆగిపోయింది.

ఏమిటా అని చూద్దునుగదా ఎదురుగుండా గంధపు కొండల్లాంటి గడ్డిబళ్ళు రోడ్డు దాటుతున్నాయి, వెళ్ళటానికి సందు దొరక్క విసుక్కుంటూ ఆపేశాడు డ్రైవరు.

ఆగటంతోనే దాశయ్యకి నిద్రాభంగం అయినట్టుంది—

"దాషా! దాషా! తీపి—"

జంగిడీ వున్నట్టే ఉత్తిచెయ్యి పయికెత్తి అరుస్తూ. లేవబోయి నా మీదకే తూలిపడ్డాడు పట్టుకోగలిగానుకాబట్టి సరిపోయింది. ●

